నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 6 మే 2024 | YADADRI BHUVANAGIRI

## పాలనను పట్టించుకోని కాంగ్రెస్

- బీఆర్ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

నల్లగొండ, మే 5 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి పాలనను సరిగ్గా పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి అన్నారు. బీఆర్ఎస్ గెలిస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని, లేదంటే వాటిని తుంగలో తొక్కుతుందని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డితో కలిసి పట్టణంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం మార్నింగ్ వాకర్స్‌ను ఓటు అభ్యర్థించారు. సీఎం, మంత్రులు బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయడం తప్ప.. పాలన గురించి పట్టించుకోవడం లేదన్నారు.



నల్లగొండలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

# కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ మోసం

- బీఆర్ఎస్‌తోనే సమన్యాయం
- బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్

భూదాన్ పోచంపల్లి, మే 5 : కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. మండలంలోని దేశ్‌ముఖి, పిల్లాయిపల్లి, జగత్‌పల్లి, పెద్దగూడెం, జూలూరు, కప్రాయపల్లి, పెద్దరావులపల్లి, గేసుకొండ, జలాల్‌పూర్, మెహర్‌నగర్, పోచంపల్లి గ్రామాల ముఖ్య కార్యకర్తలతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పుడు గాలి ముచ్చట్లు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను, కేసీఆర్ చేసిన అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు వివరించాలన్నారు. పోటీలో ఉన్న 37 మందిలో ఒక్క కేసూ లేని వ్యక్తిని తానేనని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బడుగు, బలహీన వర్గాలకు ఆరు ఎంపీ స్థానాలు కేటాయించిందని, బీఆర్ఎస్‌తోనే సమన్యాయం సాధ్యమని అన్నారు. తాను గొర్రెల కాపరి నుంచి వచ్చిన వాడినని, 17 సీట్లలో సమన్యాయంగా ప్రాధాన్యత కల్పించడంతో తనకు టికెట్ లభించిందని తెలిపారు. అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై నాలుగు నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. పుణ్యాత్ముడు పాదాలు పెట్టగానే రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తున్నదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బయటికి రాగానే రాష్ట్రంలో మార్పు వచ్చిందని, మనం ప్రతిపక్ష పాత్ర సక్రమంగా నిర్వహించాలని అన్నారు. కేసీఆర్‌పై ప్రజల్లో విశ్వాసం ఉన్నదని, భువనగిరి పార్లమెంటు స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో 40 కోట్ల మంది తిండి, బట్టలు లేక, 25 శాతం గ్రామాల్లో కరెంటు, రోడ్లు, విద్య లేక బాధపడుతుంటే బీజేపీ ప్రభుత్వం శ్రీరాముడు, పుల్వామా దాడులు అంటూ దేశాన్ని నాశనం చేస్తుందని విమర్శించారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి ఇంట్లో రెండేసి పదవులతో కుటుంబ పాలన సాగుతుందన్నారు. భువనగిరి కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తానని హామీ ఇవ్వడంతో రాజకీయ నాటకాలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఎక్కువ ఎంపీ సీట్లు రాకుంటే సీఎం రేవంత్‌రెడ్డికి పదవీ గండం ఉన్నదన్నారు. బడుగు, బలహీనవర్గాల బిడ్డనైన తనను గెలిపిస్తే మీ సేవకుడిగా పని చేస్తానని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, పక్కన జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి

జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ మోసపూరిత హామీలతో గద్దెనెక్కి రైతులు, ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు రూ.2,500, పింఛన్ల పెంపు, రైతుబంధు, ఆడబిడ్డల పెండ్లికి తులం బంగారం, ఐదు లక్షల విద్య భరోసా కార్డు, విద్యార్థినులకు స్కూటీలు ఎక్కడ అమలు చేశారని ప్రశ్నించారు. మూడు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత కనిపిస్తుందని, కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేశామా? అని బాధపడుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మి మరోసారి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి, జడ్పీటీసీ కోట పుష్పలత, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్‌యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ బందరపు సుమలత, నాయకులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు



చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

## కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధం

- మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్, మే5 : భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌దే విజయం అని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిఫల్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని, హామీలను అమ లు చేయలేక రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేస్తూ కాలం గడుపుతున్నారని మూడు నెలల్లోనే ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు అర్థమైందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ప్రాతినిధ్యం తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు అవసరమని చెప్పారు. ఈ సమావేశంలో భువనగిరి ఎన్నికల ఇన్‌చార్జి వెంకటనారాయణగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాల ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గిర్కాటి నిరంజన్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, తాడూరి శిరీషాపరమేశ్, ఆలె నాగరాజు, దుబ్బాక శశిధర్‌రెడ్డి, లత్తాహార్ పాషా, బొమ్మిరెడ్డి వెంకట్‌రెడ్డి, నరసింహ, ఆల్మాసిపేట కిష్టయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి

## బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలి

- క్యామ మల్లేశ్‌కు అత్యధిక మెజారిటీ అందించాలి
- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి

మోటకొండూర్, మే 5 : భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి అన్నారు. మోటకొండూర్ మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో ఆదివారం బీఆర్ఎస్ ఎన్నికల వాల్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యామ మల్లేశ్‌ను అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల అబద్ధాలను ప్రజలకు వివరించాలని బీఆర్ఎస్ కార్యకర్తలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్ గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, జడ్పీటీసీ పల్లా వెంకట్ రెడ్డి, ఎంపీటీసీ పన్నాల అంజిరెడ్డి, నాయకులు పైళ్ల సత్యనారాయణ రెడ్డి, సూదగాని రాందాసు గౌడ్, భూమండ్ల ఐలయ్య, అనంతుల జంగారెడ్డి , ఎండీ బురాన్, ఎగ్గిడి కృష్ణ, ఎర్ర మల్లేశ్‌యాదవ్, చామకూర అమరేందర్ రెడ్డి, సైకిలాబ్ రెడ్డి, భూమండ్ల యాదయ్య, బీస కృష్ణంరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షం.. అతలాకుతలం

- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఈదురుగాలుల వర్షం
- విరిగిన చెట్లు, కూలిన విద్యుత్ స్తంభాలు
- నేలరాలిన మామిడి కాయలు, నిమ్మకాయలు
- పిడుగుపాటుకు ఒకరు దుర్మరణం.. ఎనిమిది పశువులు మృతి
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- వర్షానికి చల్లబడిన వాతావరణం



నల్లగొండలో కురుస్తున్న వర్షం



సూర్యాపేటలో తాటిచెట్టు మీద పడిన పిడుగు

సంస్థాన్ నారాయణపురం/మోత్కూరు/అడ్డగూడూరు/గుండాల/వలిగొండ/ మే 5 : గాలిదుమారంతో కూడిన వర్షం అతలాకుతలం చేసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులు కురిశాయి. పిడుగుల వర్షం పడింది. ఈదురుగాలులకు పలు చోట్ల ఇంటిపైకప్పు రేకులు ఎగిరి పడ్డాయి. చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. తోటల్లో మామిడి కాయలు, నిమ్మకాయలు కింద రాలాయి. పిడుగుపాటుకు ఒక వ్యకి చనిపోయాడు. ఎనిమిది పశువులు మృత్యువాత పడ్డాయి. తాటి, కొబ్బరి చెట్లపై పిడుగులు పడి మంటలు చెలరేగాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. ఈ వర్షం ప్రజలతోపాటు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. అడ్డగూడూరు మండలం కోటమర్తిలో పిడుగుపాటు వ్యక్తి చనిపోయాడు. ఒక బర్రె మృతి చెందింది. గుండాల మండలం తుర్కలషాపురం ఒక బర్రె, వలిగొండ మండలం వెంకటాపురంలో ఒక ఆవు, సంస్థాన్ నారాయణపురం మండలం గుజ్జలో రెండు ఆవులు, ఆత్మకూర్.ఎం మండలం పారుపల్లిలో ఒక ఎద్దు, చండూరు మండలం ఉడుతపల్లిలో ఆవు పిడుగుపాటుకు మృతిచెందాయి. వర్షంతో వాతావరణం చల్లబడగా ఎండ వేడిమి నుంచి జనం ఉపశమనం పొందారు.



మోత్కూరులో నేలరాలిన మామిడి



సంస్థాన్ నారాయణపురం : వెంకంబావి తండాలో నేలకూలిన స్తంభం



గుండాల మండలం తుర్కలషాపురంలో పిడుగుపాటుకు మృతి చెందిన గేదె

# పోలింగ్ శాతం పెంపే లక్ష్యం

## పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు

- తీవ్ర ఎండల నేపథ్యంలో అన్ని వసతుల కల్పన
- సాయంత్రం ఆరు గంటల వరకు ఓటేసే అవకాశం
- ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంల తరలింపు
- 83శాతం ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి
- వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర పరిశీలన
- సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



ఇంటర్వ్యూ Interview

నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమంతు జెండగే

**పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచడమే లక్ష్యమని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హన్మంతు కె. జెండగే స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోసుకుండా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. ఎన్నికలను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలించనున్నట్లు చెప్పారు. 403 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. ఆదివారం నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూలో కలెక్టర్ పలు విషయాలను వెల్లడించారు.**

*– యాదాద్రి భువనగిరి, మే 5 (నమస్తే తెలంగాణ)*

### పోలింగ్ పెంపునకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఇప్పటికే ఓటు హక్కుపై విస్తృత ప్రచారం నిర్వహించాం. ప్రతి గ్రామంలో పోస్టర్ల ద్వారా, ఫ్లెక్సీల ద్వారా, ప్రచార రథాల ద్వారా ఓటర్లలో అవగాహన, చైతన్యం కల్పించాం. ఇక స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థులతో సంకల్ప పత్రం తీసుకున్నాం. ఉపాధి హామీ కూలీల వద్ద ఓటుపై అవగాహన చేపడుతున్నాం. ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి. ఇదే సమయంలో ఏ ఒక్కరూ ప్రలోభాలకు గురికావద్దు. ఎక్కువ శాతం మంది ఓటు హక్కు వినియోగించుకుంటారని భావిస్తున్నాం.

### పోలింగ్ సమయం పెంచారా..?

పోలింగ్ రోజు పోలింగ్‌కు రెండు గంటల ముందే మాక్ పోలింగ్ ఉంటుంది. దీనిపైన అభ్యర్థులందరికి కూడా అవగాహన కల్పించాం. పోలింగ్ ఏజెంట్స్ అందరూ ముందుగానే చేరుకోవాలి. ఫామ్ 10 నింపి, ఐడెంటిటీ కార్డును తీసుకోవాలి. పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మే 13న పోలింగ్ సమయాన్ని గంటపాటు పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ నిర్వహించేందుకు అనుమతి ఇచ్చింది.

### పోలింగ్ ఏర్పాట్ల గురించి..?

పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రి అందిస్తున్నాం. రెండో విడుత ర్యాండమైజేషన్ ద్వారా పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం యంత్రాలను కేటాయించాం. 25శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 40శాతం అదనంగా వీవీ ప్యాట్లు కేటాయించాం. పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి రెండు పోలింగ్ స్టేషన్లకు ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించాం. రెండు కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లను ఉన్న దగ్గర ఇద్దరు, ముగ్గురు మైక్రో అబ్జర్వర్లను పెట్టాం. రాష్ట్ర పోలీసు బలగాలతోపాటు కేంద్ర బలగాలను కూడా అందుబాటులో ఉంచాం.

### ఎన్ని ఈవీఎంలను వినియోగిస్తున్నారు..?

ఎన్నికల్లో 39మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఒకటి నోటా ఉంటుంది. మొత్తం 40 గుర్తులకు మూడు బ్యాలెట్లు ఉంటాయి. కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్ ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ఒక్కొక్కటి ఉంటాయి. పార్లమెంట్ పరిధిలో మొత్తం 2,141 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 6,429 ఈవీఎంలు అవసరం పడతాయి. ఇవే కాకుండా వివిధ కారణాలతో ఇబ్బందులు తలెత్తితే సమస్య లేకుండా మరికొన్ని ఈవీఎంలను ముందస్తుగా తరలిస్తాం. బ్యాలెట్లపై తొలుత జాతీయ పార్టీల అభ్యర్థుల పేర్లు, ఆ తర్వాత గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థుల పేర్లు, ఫొటోలు, గుర్తులను ముద్రిస్తారు.

### వృద్ధులు, దివ్యాంగులకు ఏమేం సదుపాయాలు కల్పిస్తున్నారు..?

80ఏండ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులను సంప్రదించాం. వారికి రవాణా కావాలంటే ప్రత్యేకంగా సిబ్బంది వాళ్ల ఇంటి నుంచి పోలింగ్ బూత్ వరకు తీసుకొస్తారు. ఓటు వేశాక తిరిగి ఇంటికి తీసుకెళ్లి డ్రాప్ చేస్తారు. పోలింగ్ స్టేషన్‌లోని ప్రతి లొకేషన్‌లో వీల్ చైర్ ఏర్పాటు చేయడంతో పాటు దాన్ని నెట్టడానికి వలంటీర్లను కూడా అందుబాటులో ఉంచాం. వాళ్లను ఇంటి నుంచి తీసుకొచ్చి.. ఓటు వినియోగించుకున్నాక.. మళ్లీ ఇంటి దగ్గర దించేవరకు అన్ని జాగ్రత్తలు చూసుకుంటారు.

### ఎండల నేపథ్యంలో ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు..?

ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు తాగు నీటి సదుపాయం, నీడ, ఫస్ట్ ఎయిడ్ కిట్, సెలైన్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పోలింగ్ స్టేషన్లలో వెలుతురు అంశం మా దృష్టికి వచ్చింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో లైటింగ్ మంచి ఏర్పాటు చేస్తాం. కరెంట్ సరఫరా, బల్బులను పెట్టాం. 2141పోలింగ్ స్టేషన్లలో మంచి లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసి.. ఎవరికి కూడా ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

### ఓటరు స్లిప్పుల పంపిణీ ఎంత వరకు వచ్చింది..?

జిల్లాలో ఇప్పటికే 83శాతం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశాం. కొందరు బయట ఉండటం, మరి కొందరు చనిపోవడంతో మిగిలిపోయాయి. మిగిలి ఉన్న సమయంలో వంద శాతం పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఓటు వేసే సమయంలో ఓటరు కార్డుతోపాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన డాక్యుమెంట్లలో ఏదో ఒకటి చూపించాలి. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

### సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలెన్ని..?

పార్లమెంట్ పరిధిలో 403 సమస్యాత్మక పోలిం గ్ కేంద్రాలను గుర్తించాం. రెండు వల్నరబుల్ పో లింగ్ బూత్‌లను ఐడెంటిఫై చేశాం. ఆయా ప్రాంతా ల్లో అదనపు బలగాల ఏర్పాటుకు ప్రణాళిక రూ పొందించాం. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

## కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్, మే 5 : కాంగ్రెస్, బీజేపీ మాయమాటలు నమ్మి మోసపోద్దని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని పామనుగుండ్ల, పిట్టంపల్లి గ్రామాల్లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను తుంగలో తొక్కిందన్నారు. ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, బీఆర్ఎస్ తెచ్చిన రైతుబంధును నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తరాల బలరాములు, నాయకులు పోగుల నర్సింహ, జానీపాషా, వడ్డె సైదిరెడ్డి, పసన సైదులు, గుండగోని రాములు, రవి, శ్రీను, దేవేందర్, భిక్షం, నర్సింహ పాల్గొన్నారు.



పిట్టంపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య